

# మనసు కలత

శ్రీమతి గుడిపాటి వెంకట సుబ్బమ్మగారు

మూర్తిగారు ఒక గౌరవసంపన్న గృహస్థులు. వీరు బ్రాహ్మణులు. ఇద్దరుపిల్లలు వీరికి. ఒక ఆడపిల్ల, ఒక మొగపిల్లవాడు. ఆడపిల్లే పెద్దది. పిల్లాడు ఒకసంవత్సరం వయస్సువాడు. వీరిభార్య సుశీలాంబ. ఈమె అంత అందమయినది కాకపోయినా అనాకారి మాత్రంకాదు. మరియాద కుటుంబంలోంచి వచ్చినపిల్ల. పేదలయందు దయకలది. కుటుంబంలో మంచిపేరు తెచ్చుకోవాలని యీమెకోరిక. వీరి స్వగ్రామం రాజోలు. ఈవూరులో వీరికి యిల్లూ భూములూ వగైరా అన్నీవున్నాయి. ప్రస్తుతం మెడ్రాసులో మూర్తిగారికి పనిఅవడంవల్ల ఒకచిన్నమేడ అద్దెకుతీసుకుని వుంటున్నారు: మకాం అంతాక్రిందే. పడుకోడానికిమాత్రం ఒకగదిఉంది పైన. తక్కిన భాగమంతా విశాలమైన డాబా. మూర్తిగారికి భార్యమీద యెంతో ప్రేమ. ఆఫీసువదలి యింటికి రాగానే బట్టలు మార్చడం తిన్నగా వంటింటిలోకి రావడం మామూలు. సుశీలాంబ యేకారణంచేతేనా అక్కడలేకపోతే పిల్లలతో 'మీ అమ్మేది, ఏంచేస్తోంది, ఎక్కడ వుంది' అంటూ వాళ్లజవాబేనా వినకుండా ఆమెను వెతుక్కుంటూ దొడ్డివేపునకు వెళ్లేవాడు. పోనీ అంటే యేమీపనిలేదు. అవిడను చూడ్డమే నేమో ఆయనపని. ఆమెకూడా భర్తయందు భయభక్తులు కలిగివుండేది. కాని ఎంతోచనువు. వీరిదాంపత్యం వీరికేకాకుండా చూసేవాళ్ళకి కూడా ఎంతోముచ్చటగా వుండేదని చెప్పొచ్చు. అన్నీబాగానే వున్నాయి. కాని అభిప్రాయాలు కొద్దిగా తేడా. అంచేత వాగ్వివాదాలు జరుగుతూ వుండేవి. మూర్తిగారిది అంతా ఆధునికనడవడిక. సుశీలది ప్రాచీనపద్ధతి. కొంతవరకు తన ఉద్దేశం తెలియపరచి ఆయన యెల్లాగా వినరని వూరుకునేది సుశీల. అందువల్ల మూర్తిగారే వాగ్వివాదాల్లో విజయం పొందేవారు. అసలు ఆమె వాదిస్తుంటే చూడాలని అదొకవిధమైన సరదా మూర్తిగారికి. ఒకనాడు మాటలవరుసని ఆడవాళ్ళకి పక్కపాపిడి అందం అన్నారు మూర్తిగారు. కొంతవయస్సుదాకా అందమేగాని మొత్తంమీద మధ్యపాపిడి వున్నంత అందమురాదంది సుశీల. తక్షణం మూర్తిగారు అందుకుని కొంత వయస్సేమిటి ఎంతవయసు వచ్చినా, జుట్టు, బొట్టు, కట్టు అన్నీదిద్దుతే వయస్సు కూడా కనబడదన్నారు. ఎప్పుడు అల్లాగే ఉంటాయి మీమాటలు. ఏంచేసినా వయస్సు మొఖం మీదకనపడి తీరుతుందని యీమె వాదన. తనమాట నిజమనిపించాలని మూర్తిగారిపట్టు. చివరకి ఎల్లాగా తెమిలేదికాదని సుశీలే వూరుకునేది. ఇవేవివాదాలు. 'ఏం సుశీలా! నువ్వేవోడిపోయావుకదూ చివరకి' అనినవ్వేవారు మూర్తిగారు.

ఇల్లా సరదాగా కాలం గడపడం దేమునికి యిష్టం లేదన్నట్టు ఏదో ట్రెయినింగని బెంగుళూరు వెళ్ళమన్నారు ఆఫీసువారు. వెళ్ళకతప్పదు. భార్యనీ పిల్లలని తీసుకు వెళదామా అంటే కూతురుచదువులోంది. ఐదోక్లాసుగాని చదువు పాడుచెయ్యడం మూర్తిగారికి యిష్టంలేదు. పోనీ అంటేరెండునెల్లు ట్రెయినింగు అయ్యాక మళ్లీయిక్కడికే వొచ్చెయ్యాలి. ఆ బెంగుళూరులో యీరెండునెల్లభాగ్యానికి యిల్లెక్కడ దొరుకుతుంది? ఆయన ఒక్కరూ అయితే ఏహోటల్లోనో గడిపి వస్తారు. అని తనవల్ల భర్తకి యిల్లూ అవీచూడ్డం శ్రమ అని సుశీలాంబ తీర్మానించుకుని, పిల్లచదువు పాడవకుండాను భర్తకి శ్రమలేకుండాను రెండునెలలు యిక్కడే గడుపుకుంటానంది. సరేనని తీర్మానించుకున్నారు యిద్దరూను.

రేపే ప్రయాణం. సర్దడాలన్నీ అయిపోయాయి. రాత్రితొమ్మిది కొట్టారు. రేపటినుంచి రెండునెల్లు ఎల్లాగడుస్తాయా అనిబాధ యిద్దరికీని. పైకిమాత్రం ధైర్యంగా వున్నారు ఒకళ్లకంటే ఒకళ్లు. సుశీలాంబ కమలపాదులకు సున్నము రాస్తూవుంది. ప్రక్కనే కూర్చున్నారు భర్త. కడుపులో బెంగగావుంది. ఏం మాట్లాడాలో తెలియలేదు సుశీలాంబకు. 'అయితే రోజువిడిచి రోజూ వుత్తరం వ్రాస్తారుకదూ' అంది చివరికి. సుశీలాంబ జడలో పువ్వులుసర్దుతూ 'ఓ ఓ, రోజువిడవడం యెందుకు? రోజూవ్రాస్తాను. ఆఫీసు డ్యూటీ అవగానే నీడ్యూటీ పెట్టుకుంటాను. సరేనా' అన్నారు ఆయన నవ్వుతో. 'అబ్బానిజంగా వ్రాయాలిసుమండీ; నవ్వడంకాదు. 60 కవర్లుతెప్పించి కట్టకట్టి మీపెట్టిలో పెట్టాను' అంది. 'బాగానే వుందిగాని మరి 60 కల్లీలు కూడా కట్టియిస్తావేమిటి, సుసీ, మళ్లీయిబ్బంది అవుతుందేమో' అన్నారు ఆయన ఆమెముఖం తనముఖంవేపుకి తిప్పుకుని.

తెల్లారింది. కారువచ్చి మూర్తిగారి వాకిట్లో ఆగింది. నౌకర్లు సామానులు పట్టుకెళ్లి కారులో పెట్టారు. పిల్లలదగ్గిర శలవుపుచ్చుకున్నాడు. 'వెళ్లివస్తా సుసీ జాగ్రత్త' అనిమాత్రం అనగలిగాడు. ఆయన కారులోకూర్చోగానే వేగంగాపరుగెత్తి అదృశ్యం అయిందికారు. కారువెళ్లినవేపే చూస్తూ ఆలోచిస్తూ అల్లాగే అరగంట నుంచుని వుండిపోయింది సుశీలాంబ. చంటిపిల్లవాడి యేడుపు వినపడడంవల్ల యింట్లోకి వెళ్ళక తప్పిందికాదు.

*   *   *

మూర్తిగారు బెంగుళూరులో హోటల్లో ఒకగదిలో ప్రవేశించారు. ఇది చాల్లచిన్నహోటలు. సుమారు పది పదిహేను కుటుంబాలకి మాత్రం చోటువుంటుంది. కాని ఎందువల్లనో యిప్పుడు ఖాళీగానేవుంది. హోటలులో దిగినవాళ్ళందరికి భోజనానికి ఒకపెద్దహాలువుంది. అక్కడ బల్లలు కుర్చీలు వగైరా అన్నిపరికరాలున్నాయి. భోజనంవేళ అవగానే గంటకొడతారు. అందరు హాలులోకి వెళ్లి భోజనం చెయ్యాలి. మూర్తిగారు స్నానం మొదలయిన తనుపనులన్నీ తీర్చుకుని, భోజనం టయిము అవడంవల్ల హాలులోకి వెళ్లారు. అప్పటికే ఒకబల్లదగ్గిర రెండు కుర్చీలమీద యిద్దరు భోజనానికి కూర్చున్నారు. దంపతులేమో! వేరేయింకొక బల్లదగ్గిర తనకి యేర్పాటు చేసిన కుర్చీమీద కూర్చుని ముందుచెయ్యవలసిన ఆఫీసుపనులనూ, ఇల్లువెతుక్కోడం గురించీ ఆలోచించుకుంటూ భోజనం ముగించుకుని గదిలోకి వచ్చేశారు మూర్తిగారు. రాత్రేసుశీలాంబకు తనుక్షేమంగా చేరినట్లు వుత్తరంవ్రాసి పోష్టులోవేశారు.

మూర్తిగారు మరునాడు భోజనానికి వెళ్లినప్పుడు కూడా ఆదంపతులు వచ్చారు. మొదటి రోజు మూర్తిగారు వీరిని అంతగా చూడలేదు గాని ఇవాళచూశారు. ఆ అమ్మాయి చాలా అందగత్తె. సుమారు 18 సంవత్సరాలుంటాయి. మర్యాదకుటుంబంలోనుంచివచ్చిన పిల్లలాకనపడుతోంది. ఏకులమోకాని బ్రాహ్మణులు మాత్రం కారనితోచింది. ఆమెనేత్రాలలో భయమూ, అసంతృప్తి తాండవం ఆడుతూన్నట్లున్నాయి. ఆమెభర్త బలహీనంగానూ అనారోగ్యంగానూ వున్నట్లు కనపడతాడు. అందమైనవాడేగాని మాటల్లో నాగరికత తక్కువగా కనబడుతుంది. అసలు ఆఅమ్మాయి అసంతృప్తికి కారణం యిదేనేమో. ఏమిభగవంతుని ఏర్పాటు! ఆ అమ్మాయికి ఆ అనారోగ్య వంతుడా భర్త? అనిపించింది. ఎన్నివున్నా ఏదో లోటు చూపిస్తాడు.

పదిరోజులు గడిచిపోయాయి. మూర్తిగారికి యిల్లుదొరకనేలేదు. వెతికి వెతికి చివరకిప్రాణం విసిగి ఆప్రయత్నం మానేసి యీరెండునెల్లూ హోటల్లోనే గడపడానికి యేర్పాటుచేసుకున్నారు. ఆప్రక్కగదిలోవాళ్లు కూడా అక్కడే ఉన్నారు. వారికీ యిల్లుదొరకలేదేమో? అసలువాళ్లు ఏమిపనిమీద వచ్చారో?

ఆయనపగలు మూడుగంటలదాకా యింట్లోనే ఉండేవాడు. ఆతరువాత ఎక్కడికో వెళ్లి ఎప్పుడో వచ్చేవాడు. బహుశా యీవూరు గాలికోసం వచ్చారేమో.

ఆరోజు ఆదివారం. మూర్తిగారు గదిలోనే వున్నారు. తాంబూలం నములుతూ పడకకుర్చీలో ఆలోచిస్తూ పడుకునివున్నారు. ఆహోటల్లోగదులన్నీ వరుసగావున్నాయి. ముందరస్థలం అంతావిశాలమైన వరండా ఉంది. ఆవరండాలో కూడా కుర్చీలువున్నాయి. సాయంత్రమప్పుడు చల్లగాలికి కూర్చోడానికి వీలుగాఉంది. ప్రక్కగదిలో అమ్మాయి వరండాలోకివచ్చి 'పనిచేసేకుర్రాడు మంచినీళ్లు పెట్టడం మరిచిపోయాడు; మీకూజాలో కొంచం నీళ్లువున్నాయాండి' అని అడిగింది మూర్తిగారిని. మూర్తిగారులేచి 'అవును; వెధవలు పనిసరిగ్గాచెయ్యరు' అని అంటో ఒకగ్లాసెడు కూజాలో నీళ్లు యిచ్చారు. నీళ్లుతీసుకుని కృతజ్ఞత తెలుపుతూ వెళ్లిపోయింది ఆ అమ్మాయి. మరునాడు మధ్యాహ్నం భోజనం సమయంలో మూర్తిగారిని చూపెట్టి నిన్నటి మంచినీళ్లవిషయం చెప్పింది భర్తతో. అదిమొదలు వీరికి వారికి పరిచయం మొదలెట్టింది. వరండాలో కనపడ్డప్పుడల్లా బాతాఖానీ వేసుకుంటూండేవాళ్లు. ఒకరిగదిలోకి యింకొకరు వెడుతుండేవారు. యీవిధంగా బాగాపరిచయం అయింది.

ఆరోజు మూర్తిగారు ఆఫీసునుంచివచ్చి కాఫీమాత్రం గదిలోకి తెప్పించుకున్నారు. తలనొప్పిగా వుందని ఫలహారం చెయ్యలేదు. మామూలుప్రకారం మూర్తిగారు హాల్లోకి ఎందుకు రాలేదని వెంటనే వచ్చింది అ అమ్మాయి. ఆమెపేరు కమల. కూర్చోండి కమలమ్మగారూ అనికుర్చీచూపించారు మూర్తిగారు. కమల కూర్చుంటో 'మీకంటే నేనుచాలాచిన్నదాన్ని; అంత ఎక్కువగా మన్నిస్తే నాకుచిన్నతనంగాఉంది. ఇప్పటినుంచి నన్నుకమల అనిపిలిస్తే సంతోషిస్తాను' అందినవ్వుతో. 'మిమ్మలిని చిన్నపుచ్చడం నావుద్దేశం కాదు. మీరుచెప్పినట్లే పిలుస్తాను' అన్నారు మూర్తిగారు కూడా నవ్వుతో. 'మీరు ఫలహారానికి హాల్లోకి ఎందుకురాలేదు. ఇవాళ నేను ఒకర్తినే వెళ్లాను. తినాలనే లేకపోయింది. కాఫీమాత్రం తాగి యిల్లా వచ్చాను' అందికమల. 'అల్లాగా మీభర్తగారు అప్పుడే వెళ్లారు యివాళ?' అన్నారు మూర్తిగారు. ఆమాటకు ఆవిడ వులిక్కిపడ్డట్టు కనిపించింది, క్షణకాలం తలవంచుకుని ఏదో ఆలోచించి చివరకి కొంచం హీనస్వరంగా 'ఆయన నాభర్తకారు. నేను అవివాహితను' అంది. 'అ! ఆయన మీభర్తకారూ? క్షమించండి. పొరపాటు పడ్డాను' అన్నారు మూర్తిగారు. ఇలామాట్లాడుతో వుంటోనే ఒకబండివచ్చి గుమ్మంలో ఆగింది. ఇదివరకు కమల భర్త అనుకున్న ఆయన పేరుదాసుగారు. దాసుగారు ఆబండిలో స్పృహతప్పి పడుకుని వున్నారు. నౌకర్లు ఆయన్ని చేతులమీద తీసుకువచ్చి వారిగదిలో పడుకోపెట్టారు. కమల మొఖం అసహ్యంచేత వంచుకుని మూర్తిగారి గదివదలి తనగదిలోకి వెళ్లిపోయింది.

* * *

అప్పుడే మూర్తిగారువెళ్లి ఒకనెలయింది. సుశీలాంబకి ఒకదినం ఒకయుగంలా కనపడుతోంది. ఆరోజురాత్రి 9 గంటల సమయంలో డాబామీద పడకకుర్చీ వేసుకుని కూర్చుని ఆలోచిస్తోంది సుశీలాంబ. పిల్లలు యిద్దరు నిద్రపోతున్నారు. నౌకర్లు పనిముగించుకుని వెళ్ళిపోయారు. నిశ్శబ్దమై నిరాటంకమైన సమయంలో ఆమె అల్లా ఎంతసేపు ఆలోచిస్తోందోకాని అచల్లగాలిలో కూడా ఆమెకు ముచ్చెమటలు పోశాయి. ఇంకా యీవిధంగా తలపోస్తోంది '20 రోజులదాకా ప్రతిరోజూవుత్తరం వ్రాశారు. అతరువాత యీ పదిరోజులనుంచీ వ్రాసినఉత్తరాలు అంతశ్రద్ధగా కనపడవు; నాలుగురోజులకి వ్రాసినట్టు, ఏదోక్షేమం వ్రాసినట్టూవున్నాయి. కారణం యేమయివుంటుంది? పనిఎక్కువ అయిందోయేమో, పైగా వుత్తరంవచ్చి యేనాలుగురోజులో అయింది. భోజనసదుపాయంలేక యేఅనారోగ్యమో పట్టుకోలేదుకదా అని భయంవేసింది. కాని మొన్నవ్రాసిన ఉత్తరంలో పనితొందరలో ఉన్నట్టున్నా, ఆరోగ్యంగావున్నట్లు వుందికదా? ఎంతపనైనా 5 గంటలతోటే అఖరవుతుంది. నిజంగా పనివున్నా తనదినచర్యలో యిదొకపనిగా పెట్టుకుని మానకుండా వుత్తరం వ్రాసేవారికి తేడారావడానికి తగినంత కారణం వుండితీరాలని యీవిధంగా ఆలోచిస్తూ చంటికుర్రాడు ఏడుపువిని గదిలోపలకెళ్ళి నిద్రపోయింది. (సశేషము)

# మనసుకలత

శ్రీమతి గుడిపాటి వెంకటసుబ్బమ్మగారు

(గతసంచిక తరువాయి)

ఇల్లా కాలం గడుస్తూ ఉండగా బెంగుళూరులో ఒకనాటిరాత్రి మూర్తిగారు నిద్రపోతున్నారు. ఏదో పెద్దశబ్దంవినపడి మెళుకువచ్చింది. కమలగదిలో ఏదో మూలుగులా వినవచ్చింది. అకస్మాత్తుగా గదితలుపు తీసుకుని ఎవరో బయటికి వెళ్లిన చప్పుడుకూడా అయింది. మూర్తిగారు వరాండాలోకి వచ్చిచూచారు. కమలగది తెరిచివుంది. ఆమె గదిలో డ్రెస్సింగు టేబిల్ దగ్గిర క్రింద పడివుంది స్పృహ లేకుండా. ఆమెకు గాయం తగిలింది కాబోలు మొఖం అంతా నెత్తురు. రవిక చీరకూడా కొంతవరకు నెత్తురుతో తడిసివున్నాయి. వెంటనే మూర్తిగారు లోపలికి వెళ్లారు. ఆయనకి అదృశ్యం చూడ ఆశ్చర్యం వేసింది. "ఇదేమిటి కమలా? ఏమయింది, దాసుగారుఏరీ?" అంటూ వెళ్లి కమలకి స్పృహలేక పోవడంచూసి వెంటనే లేవతీసి మంచంమీద పడుకో పెట్టారు. ఆమెకు తలమీదగాయం తగలడం గ్రహించి రక్తంకట్టడానికి కట్టు కట్టారు. ఉపచారాలవల్ల కమల తెప్పిరిల్లింది. మూర్తిగారిని చూడగానే ఆమెకి దుఃఖం ఆగింది కాదు. చిన్నపిల్లలా ఏడవడం మొదలెట్టింది. "ఏంజరిగింది కమలా? ఏడిచిన లాభంలేదు. యివాళ దాసుగారు రాలేదా?" అన్నారు. "రాకేం, యిదంతా ఆయన పనే" నంది. మూర్తిగారికి ఆశ్చర్యం మరీ యెక్కువయింది. కోపంకూడా వచ్చింది. "అసలు మీయిద్దరికి దెబ్బలాట యెందుకొచ్చింది" అన్నారు. ఇన్నిరోజులనుంచి దాచిన వృత్తాంతం యీవిధంగా చెప్పడం మొదలెట్టింది కమల.

నేనుపుట్టిన పురిటిరోజుల్లో నేమాఅమ్మ చనిపోయిందిట. అప్పటినుంచి మాతండ్రిగారి చెల్లెలు (భర్తపోయినఆమె) మామేనత్త నన్ను పెంచింది. ఆమెకి ఒకడే కొడుకు. అతనే యీదాసుగారు. నాకు అయిదు సంవత్సరాలు వయస్సు వచ్చేటప్పటికే అతనికి 18 సంవత్సరాలుంటాయి. మాతండ్రిగారూ, మామేనత్త కాక మాకు యింకెవరూ ఆప్తులుగాని, బంధువులుగాని వున్నట్టు నేను ఎరుగను. నాకు 8 సంవత్సరాలు వచ్చేదాక మాతండ్రిగారున్నారు. ఆతరువాత ఆయనకూడాపోయారు. మాతల్లి విచారం తెలియదు గాని మాతండ్రిగారు పోయినందువల్ల నాకెంతో దుఃఖమనిపించింది. మాతల్లితండ్రులు లేనిలోటు లేకుండా మామేనత్త చూసేది. మాతండ్రిగారికి భూవసతి ఉండేది. ఆభూమిని, నన్నూకూడా తనచెల్లెలు కొడుక్కి వ్రాసి యిచ్చారట మాతండ్రిగారు. మాతండ్రిగారు పోయినతరువాత మాయింటికి పెద్ద మామేనత్తే. తన కొడుక్కి నాకూ చిన్నతనంలోనే వివాహం చెయ్యాలని అనుకుందిగాని మేమిద్దరం చదువుకుంటూ ఉండడంవల్ల అప్పట్లో చెయ్యలేదు. నాకు 16 సం॥ వచ్చేటప్పటికి కలరాజాడ్యంవల్లఅకస్మాత్తుగా మామేనత్త చనిపోయింది. అప్పటినుంచి దాసుగారే యింటి పెద్ద. తనఇష్టం వచ్చినట్లల్లా ధనవ్యయం మొదలెట్టారు. దురభ్యాసాలలో పడ్డారు. నన్ను పెళ్లిచేసుకోమనికూడా ఒకనాడు నిర్బంధం చేశారు. నాకు యితని దురభ్యాసాలనీ అవీచూస్తే మనస్సులో అసహ్యంగా వుండేది. ఇష్టంలేని యితనిని వివాహం చేసుకుని యీప్రపంచకములో ఏమిఆనందం అనుభవించకలనని అనిపించింది. ఇష్టం లేదని చెప్పినా లాభంలేదని తెలుసు. మోసంచేసి తప్పించుకోవాలని బుద్ధిపుట్టింది. నాకుయింకా చదవాలని వుందనీ అది అయితేగాని పెళ్లిచేసుకోననీ అప్పటికి తప్పించుకున్నాను. భగవంతుని దయనాయందు వుండడంవల్ల అప్పటికి వప్పుకున్నారు. అతి తాగుడువల్ల గుండెలు వూపిరితిత్తులు ఏజబ్బుకు లోనయ్యాయో కాని ఆయన మంచంయెక్కి ఒక సంవత్సరం ఖాయిలా పడ్డారు. ఆయనకి జబ్బుగా ఉండగానే నేను యెక్కడికైనా

వెళ్లిపోయి ఏహాస్పటల్లోనైనా నౌకరీ సంపాదించుకుని కాలక్షేపం చేద్దామనుకున్నాను. అప్పటికే, బి, ఎ, డిగ్రి పొందాను. నా మట్టుకు కాస్త నౌఖరీ దొరకదా, అని ఒకనాడు బట్టలు సర్దుకున్నాను. గాని జబ్బుగావున్న మనిషి; పాపం లేచి మంచినీళ్లైనా ముంచుకుని త్రాగలేని పరిస్థితుల్లో వదిలి ఎల్లా వెళ్లిపోను. ఎంత దుర్మార్గుడనన్నా అన్నా చెల్లెలులాగ ఒకచోటే పెరిగాం. చివరకి మనసొప్పింది కాదు. కొన్నాళ్లకు డాక్టరు సహాయంవల్ల లేచారు. మా తండ్రిఆస్తి పూర్తిగా అయిపోయింది. చివరకి అప్పు కూడా చేశాం. ఆవూళ్లోవుంటే మరియాద దక్కదని ఆయిల్లుకూడా అమ్మేసి అప్పులు తీర్చేసి వున్నడబ్బుతో యీవూరుచేరాము. నాలుగు రోజులక్రితమే మాడబ్బు పూర్తిగా అయిపోయింది, నామెడలో బంగారు గొలుసు యిమ్మని యీనాలుగు రోజుల నుంచి ఘర్షణ జరుగుతోనేవుంది. నేను ఇవ్వనన్నాను. ఆకారణంచేత నన్నుకొట్టి నాకు స్పృహలేని సమయంలో నాగొలుసు ఎత్తుకుపోయారు. ఇదిజరిగినసంగతి. అనికమల చెప్పేటప్పటికి మూర్తిగారికి మరీ ఆశ్చర్యంవేసింది. 'నాతండ్రి బ్రతికివుండగా ఆయన చేత్తోచేయించారు. ఆయన జ్ఞాపకంగా ఆగొలుసు చూస్తూ వుండేదాన్ని' అనికమల కంటతడిపెట్టింది. మూర్తిగారుచూడలేక పోయారు. 'పోలీసులకి చెప్పి దొంగని పట్టించి నీగొలుసు ఎల్లాగైనా తెప్పిస్తా కమలా' అని వూరుకోపెట్టారు. ఆమాటతే చెప్పకుంటూఆరాత్రి కమలగదిలోనే వుండిపోయారు మూర్తిగారు. పొద్దున్నే పోలీసుస్టేషనుకువెళ్లి రిపోర్టు యిచ్చివచ్చారు.

మూర్తిగారికి ఆఫీసునుంచి రాగానే కమలపని సరీగ్గా వుంటోంది. ఇంతివరకు దొంగ పట్టుపడలేదు. ఆమెమనసు యేమీబాగుండలేదు. ఆమెకు యెల్లాగైనా విచారం పోగొట్టాలనీ, మనస్సుకి విశ్రాంతి, ఆనందం కలగచెయ్యాలనీ మూర్తిగారివుద్దేశం. రోజూసాయింత్రం యిద్దరూకలిసి బైటికి తిరగడానికి వెడుతోవుండేవారు. ఒకరోజు మామూలుప్రకారం షికారుకివెళ్లే సమయం అయింది. కమల మూర్తిగారి గదిలోకివచ్చి "ఏమండీ యివాళ మీరుయింకా సిద్ధంఅవలేదేమి? మామూలులా కాకుండా యింకాదూరం వెళ్లాలని వుంది. యివాళ లాల్ బాగ్ కి వెడదామా?" అంది. అల్లాగే వెడదాము. ఎంతసేపు! అయిదు నిముషాల్లో


# రూపా

"రూపా" వెంట్రుకలను వృద్ధిపరచుటయందు, సాటిలేని తైలరాజము. అనేకమైన మూలికలచే, ఆయుర్వేద శాస్త్రరీతిగ తయారు చేయబడినది. ఇందు చేర్చిన ఓషధులు, నల్లనిపట్టువంటి కురులను పెంచుట యేకాక, బలహీనమై రాలిపోవుచున్న వెంట్రుకలకు ఆహారమునిచ్చి, గట్టిపరచును. మరియు, మెందు మెండలగు అనేకమైన శిరోవ్యాధులను వెంటనే మాన్పును.

"రూపా" తైలమును క్రమముగా ఉపయోగించునెడల, అలసిన మెదడునకు చల్లదనమునిచ్చి, మనస్సునకు ఆహ్లాదమును, శాంతమును కలిగించును, కాబట్టి దీనిని ఒక్క స్త్రీలుమాత్రమే కాక, మెదడుచే పనిచేయు ఉద్యోగస్థులు, విద్యార్థులు మొదలగువారందరు ఉపయోగించవచ్చును. ఇందు ఏవిధమైనటువంటి అపాయకరమైన క్రొవ్వు పదార్థములు కాని, మరియేయితరమైన తైలములుగాని, చేర్చలేదని హామీయివ్వబడును.

## ఉపయోగించు విధానము:

ఈ తైలరాజమును, అటులనే ఉపయోగించవచ్చును; లేనియెడల 6 ఔన్సులు, కాచి, చల్లార్చిన నువ్వుల నూనెతో కలిపి వుపయోగించవచ్చును. వారమున కొక్కతూరి. అభ్యంజన స్నానమునందు వుపయోగించిన దీనిగుణము వెంటనే విశదమగును.

ఈ తైలము, ప్రఖ్యాతిచెందిన "అరవింద్" లెబోరేటరీలయందు తయారుచేయబడినది.




ఆంధ్రదేశమంతటా ఏజంట్లు కావలయును
డిస్ట్రిబ్యూటర్లు:
పుష్పవనం స్టోర్సు తిరువల్లికేణి-మద్రాసు.

వసఫకా' నంటో సిద్ధమయి, యిద్దరు బయలుదేరారు. రోజూ నడిచే వెళ్లడం. అలసట వచ్చేటప్పటికి యింటి మొఖం పట్టడం అలవాటు. యివాళ టేక్సీ మీద వెళ్లాలని ఆలోచించి ఒకటి కుదిర్చారు. వీరికి దొరికిన టేక్సీ చాలా చిన్నది. వెనకస్థలం యిద్దరు మనుష్యులకి చాలీచాలడంగా వుంటుంది. మూర్తిగారు డ్రైవరుప్రక్క కూర్చోవాలని చూస్తున్నారు. 'ఇక్కడ యిద్దరికి చోటువుంది' అంది కమల. సరే యిద్దరూ వెనక సీటులోనే కూర్చున్నారు. లాల్ బాగ్ దగ్గిర దిగేటప్పటికి అయిదుగంటలయింది. ఒకపౌను పచ్చి ద్రాక్షపళ్లుమాత్రం కొనుక్కున్నారు. తిరగడం మొదలెట్టారు. దోవకి యిరుప్రక్కలా వున్న ఫ్లాక్స్, కారనేషన్, జినియా, కాస్మాస్ మొదలయిన చిన్న చిన్న పువ్వుల మొక్కల సౌందర్యాన్ని చూసి ఆనందిస్తూ తోటలో ప్రవేశించారు. సాయంకాలపు నీరెండ ఒక్కొక్క చెట్టుమీదపడి సువర్ణఛాయ చిమ్మినట్లు కనుపిస్తోంది. కమల తన ఆనందం తెలియపరుస్తూ అంది 'యిక్కడ మాలీలు బహునిపుణులు సుమండీ. చెట్లని పెంచడము తీగెలను పాకించడము మొదలయిన పనులను ఎంతబాగా చేశారో. ఆ మందారవృక్షం యొక్క కొమ్మలు యిష్టంవచ్చినట్లు ఎదగకుండా ఎల్లా కత్తిరించారో చూడండి. పువ్వులవల్ల తెలుస్తోంది గాని లేకపోతే అదియే చెట్టో మనం చెప్పలేక పోదుము. మనపక్క మాలీలు యింతబాగా చెయ్యలేరు' అంది.

"అవును కమలా ఆ మాలతీలతని ఆ చెట్టుమీదకి యెల్లా ప్రాకించారో చూడు. పువ్వులతో వున్న ఆ తీగె చుట్టుకోడంవల్ల ఆ చెట్టుకు కూడా అందంవచ్చింది. ఆ తీగె కూడా తనకు స్వేచ్ఛగా ప్రాకడానికి తగిన ఆధారవు దొరికిందని ఆనందంతో వుప్పొంగినట్లు పువ్వులను విరపోస్తోంది. అంటూ తనదగ్గిర ద్రాక్షపళ్లు కమలకి కూడా కొన్నియిచ్చారు. యిద్దరు మధ్య మధ్య ద్రాక్షపళ్లుతింటూ ప్రకృతిసౌందర్యాన్ని తిలకిస్తూ నడుస్తున్నారు. 'సుమారు అయిదారు సంవత్సరాలక్రితం మా మేనత్త మమ్మలిని యీ బెంగుళూరు తీసుకొచ్చింది. అప్పుడుకూడా యిక్కడికొచ్చాము. కాని ప్రకృతిలోవున్న సౌందర్యం నాకుఅప్పుడు అంతగా తెలియలేదు సుమండీ'. 'అటు చూడు కమలా ఆ లేళ్లు మనకేసి యెల్లా చూస్తున్నాయో. జంతువులలోకల్లా సాత్వికమైనవి, అందమైనవీని. మనం యేమన్నా చేస్తామని ఎల్లా బెదిరిపోయినట్లు చూస్తున్నాయో. అందుచేతే కవులు వీటికళ్లకీ ఆడవాళ్లకళ్లకీ పోల్చిచెబుతారు' అన్నారు మూర్తిగారు. 'బెదరడం అంటే జ్ఞాపకము వచ్చింది. ఆ వేళ దెబ్బతిన్న భయం యింకాపోలేదు సుమండీ' అంది కమల. యిప్పటికి ద్రోహిని పోలీసువారు పట్టుకోలేక పోయారు. మళ్లీ రేపువెళ్లి తగిన పత్తేదారుని పెట్టిస్తాను కమలా' అన్నారు మూర్తిగారు. 'పోనియ్యండి మూర్తిగారు, హారం పోతే పోనియ్యండి. హారం కారణంగా ఆ ద్రోహి యింక నా చుట్టుపక్కలికి రాడు. ఇదీ భగవంతుని దయే. ఆ త్రాగుబోతు చేతుల్లో నుంచి ఎల్లాతప్పుకోనా అనే బాధతో మండుతోన్న నాహృదయం వర్షం కురిసినట్లు చల్లపడింది. మీ పక్కని వున్నంత మట్టుకు నాకేభయం లేదని ధైర్యం తెచ్చుకున్నాను. యిప్పుడు నాయిష్టంవచ్చినట్లు వున్నా నన్ను అడిగే వాళ్లు లేరు. అంచేత నాకంటికి అతను కనపడకుండా వుంటే నే నయమని నాకోరిక' అంది కమల. యిల్లా మాట్లాడుకుంటూ చీకటి పడడంవల్ల మోటారు యెక్కారు.

మెడ్రాసులో సుశీలాంబకి వంట్లో ఆరోగ్యంగా వుండటంలేదు. అన్నహితవులేదు. రాత్రి సరిగ్గా నిద్ర పట్టదు. ఏదోపిల్లల సహాయంకోరకు లేవక తప్పక లేస్తోంది. ఒకనాడు వంటయింట్లో ఎదో పనిచేసుకుంటోంటే పోష్టుబంట్రోతు ఉత్తరం తెచ్చియిచ్చాడు. చేస్తూన్నపనికూడా మరిచిపోయి తక్షణం ఉత్తరం విప్పి చదవడం ప్రారంభించింది సుశీలాంబ.

"చి. సౌ. సుశీలకి,

నీకు ఉత్తరం వ్రాయటం ఆలశ్యమయిందని నువ్వు ఖంగారు పడతావనీ నేననుకుంటూనే వున్నాను. నావంట్లో ఆరోగ్యంగానే ఉంది. కమల విషయం యిదివరకు నీకువ్రాస్తూనే వున్నాను. ఆమెతో వున్న తను ఆమెభర్త కాడట. ఒకనాడు ఆమె మెడలో హారం ఎత్తుకుని పారిపోయాడు. ఇప్పటిదాకా వెతి

కించడం ఆడావడిలో తీరుబడిలేక నీకు ఉత్తరాలు వ్రాయడం ఆలస్యం అయింది. నేను ఒకవారంలో వస్తాను. నాట్రయినింగు అయిపోవచ్చింది. యిప్పుడు కమల నిస్సహాయమైన అనాథబాల. వొదిలిపెట్టి రావడం మనస్కరించడంలేదు. బహుశా మెడ్రాసు తీసుకురావలసి వస్తుందేమో అనుకుంటున్నాను. ఇంతేసంగతులు.

ఇట్లు
ప్రేమైకమూర్తి

పూర్తిగాచదివి ఉత్తరంమడిచి చేత్తో పట్టుకుని ఆలోచిస్తూంది సుశీలాంబ.

"మొదటి ఉత్తరాల్లో వారు అని, కమలమ్మగారని వ్రాశేవారు, రానురాను కమలలోకి దిగింది. నావుత్తరానికి అశ్రద్ధకి కారణం కమలపసా? అనాథబాలట! యీమెని యీవూరు తీసుకొచ్చి ఏంచెయ్యాలో నాకు అర్థంకావటంలేదు. నెలా పదిహేను రోజుల్లో ఒకపరాయి తెలియని ఆడదానితో యింతచనువుగా యెల్లాగ వుండగలిగారు. పురుషులస్వభావాలు యింత సులువుగా మారగలవా? అందులోనూ నాభర్త ప్రపంచకంమాదిరి కాదని నానమ్మకము; కేవలం ధర్మదేవత అనుకున్నాను." అని యింకాయేమేమో ఆలోచిస్తూ గదిలోకెళ్లి పడుకుంది. ఆమెమళ్లీ ఉత్తరంచదువుదామని విప్పింది. క్రిందమూర్తిగారి సంతకం వుంది. నీప్రేమైకమూర్తి అనిచూడగానే అప్రయత్నంగా కళ్లవెంటనీళ్లు జలజలారాలాయి. ఎందుకో ఆమెకే తెలియదు. మనస్సు బాగుండక ఆపూట భోజనం చెయ్యలేదు.

(సశేషం)


# బార్లీ నీళ్లు మరియు గంజి ఈ విధంగా తయారుచేయడం సులభము.




బార్లీ నీళ్లు: సమమట్టంగా రెండు టీస్పూనుల ప్యూరిటీ బార్లీని నీళ్లతో ముద్దచేసి, ఒక పయింటు నీళ్లలో కలిపి, ఐదు నిమిషాలు మాత్రమే తాపీగా ఉడకనిస్తేచాలు. రుచికి ఉప్పో, పంచదారో లేకపోతే నిమ్మరసమో కలపండి.

గంజి: దీనిని మామూలు ప్రకారమే చేయండి, కాని తయారు చేయడానికి 20 నిమిషాలే తీసుకుంటుంది. ఒక్క చెంచాడు ప్యూరిటీ బార్లీ ఎనిమిది చెంచాల సాధారణ బార్లీబియ్యంతో సమానమని గమనించండి.




అట్లాంటిస్ (ఈస్ట్) లిమిటెడ్, పోస్ట్ బాక్స్ నెం. 664, కలకత్తా.

APBX-4-TA

దక్షిణ ఇండియాకు సోల్ ఏజంట్లు: ప్యారీ అండ్ కో లిమిటెడ్., పోస్టుబాక్సు 12, మద్రాసు.

# మనసుకలత

శ్రీమతి గుడిపాటి వెంకట సుబ్బమ్మగారు

(గతసంచిక తరువాయి)

వారం గిర్రున తిరిగివచ్చింది. మూర్తిగారిదగ్గర నుంచి రేపుప్రొద్దున్నే మెడ్రాసులో దిగుతామని వుత్తరంవచ్చింది.

సరే ఆమరునాడు మూర్తిగారు, కమల దిగారు. కమలని వెయిటింగురూములోనే వదిలేసి తనసామానులతో యిల్లుచేరారు మూర్తిగారు. భార్యాబిడ్డల క్షేమసమాచారాలుమాత్రం కనుక్కొని స్నానంచేసి బట్టలుమార్చుకున్నారు. వంటఆవిడ వున్నా ఆరోజుఫలహారం సుసీలాంబ స్వంతంగా తయారుచేసింది. ఎన్నాళ్లనుంచో హోటల్లోతినివున్నారు భర్తఅని. రుచీనాగ్రహించకుండా తొందరగా కాఫీ ఫలహారం ముగించుకుని, "పనుంది సుసీ, వెళ్లాలి. త్వరగావంటచేయించు. రాగానే భోజనంచేసి ఆఫీసుకువెళ్లాలి" అనిమాత్రంచెప్పి వెళ్లిపోయారు. మూర్తిగారు మామూలుగా లేరు. కమలని యింటికితెస్తే ఏదోఒకప్రక్క వుండి గడుపుకునేమనిషి కాదు. ఇల్లాచనువుగా తిరుగుతే సుసీలాంబకి కష్టంగావుంటుందేమో. సుసీలని కలతపెట్టడం తనవుద్దేశంకాదు. ప్రస్తుతం హోటల్లో ఒకగదిలోపెట్టారు కమలని. నిమ్మళంగా యేఆడపిల్లలస్కూలు టీచరుగానో వేయించి తరవాత ఆమెకితగిన కుర్రాడినివెతికి పెళ్లిచెయ్యాలని మూర్తిగారివుద్దేశం. ఇంతపని తలమీద బరువుగా వుండగా మామూలు తేలిగ్గాను సంతోషంగాను ఎల్లాగుండగలరు మూర్తిగారు. ఏదోకొంపమునిగి మూర్తిగారికి తనమీదప్రేమతగ్గిందని సుసీలాంబ అనుమానం. ఇల్లా కాలప్రవాహంలో ఒకవారం గడిచింది. సాయింకాలం కాఫీతీసుకుంటూ తను రాత్రిప్రొద్దుపోయేదాకారాననీ తనకోసం ఎవరూ కనిపెట్టుకుని కూర్చోవద్దనిచెప్పి వెళ్లారుమూర్తిగారు. కమల సినీమాకివెడదామని బలవంతపెట్టడంవల్ల యిద్దరుకలిసి సినీమాకు వెళ్లారు. వచ్చేటప్పటికి రాత్రి 12 గంటలయింది. ప్రొద్దుపోవడంవల్ల- బళ్లు దొరక్క ఆరాత్రి కమలగదిలోనే వుండవలసి వచ్చింది మూర్తిగారికి. వేరేకేంపుకాటు వేసింది కమల. యిద్దరు కబుర్లుచెప్పుకుంటూ పడుకున్నారు. "ఎంతప్రయత్నంచేసినా నీకోసం యింతవరకూ ఏ ఏర్పాటుచెయ్యలేకపోయాను కమలా. ఏదోచిన్ననౌకరీ కుదిర్చి తరువాత నీకుతగ్గ కుర్రాణ్ణిచూసి నిన్ను అప్పగించానంటే నాబాధ్యత పూర్తిగావొదిలిపోతుందని" అన్నారు మూర్తిగారు మాటవరుసగా. ఆమాట కమలకి కష్టంఅనిపించింది. మీకష్టంనాకుతెలుసుగాని, నన్నుఎవరికోయిచ్చి పెళ్లిచెయ్యడానికి ప్రయత్నిస్తున్నారని నేనుఅనుకోలేదు. నామనస్సు మీరుగ్రహించారని యిన్నాళ్లనుంచి అనుకున్నాను. నేను మిమ్మలినితప్ప యింకెవరిని చేసుకో తలచుకోలేదు" అని స్పష్టంగాచెప్పింది కమల. కమలయిల్లా కోరుతుందని మూర్తిగారు ఎప్పుడుఅనుకోలేదు. "కమలా నాకు వివాహం అయిందని నీకుతెలుసుకదా? ఇల్లాకోరడం ధర్మమా? నీకోసం నేనుఒప్పుకున్నా సుసీల వప్పుకుంటుందా? నేను నీపనిలోమునిగి మాట్లాడానికేనా సమయం దొరక్క సరిగ్గామాట్లాడటంలేదని ఆమెఎంతోకుంగిపోతోంది. భార్యవుండగా సంతానంవుండీకూడా యింకొకజాతిస్త్రీని చేసుకుంటే సంఘం వప్పుకుంటుందా? భగవంతుడువప్పుతాడా? చదువుకున్నదానవు ఆలోచించుకమలా" అని తడుముకోకుండా మూర్తిగారు అంటూంటే కమలకి ఏడుపుఆగింది కాదు. గోడవేపుతిరిగి వెక్కివెక్కి ఏడవడం మొదలెట్టింది. మూర్తిగారు చూడలేకపోయారు.

కమలమంచం దగ్గిరకి వచ్చి "కమలా ఏడుస్తున్నావా? ఛా! ఇటు చూడూ" అన్నారు. కమల కొంతసేపటికి తెప్పిరిల్లి కళ్ళు తుడుచుకుని మూర్తిగారి కళ్ళల్లోకి దీనంగా చూస్తూ అంది "రెండు పెళ్ళిళ్ళు చేసుకున్నవాళ్ళు ఎందరు లేరు. గొప్పవాళ్ళలోనూ కొద్దివాళ్ళలోనూ కూడా వున్నారు. దేముడు మెచ్చుకోడా? దేముడు మెచ్చుకోపోవడానికి ఏం ద్రోహం వుంది. మీ భార్యని వదిలెయ్యమన్నానా? సంఘమా! మనకు గురికి యిష్టమయ్యాక సంఘంతో మనకేమి పని. పోనియ్యండి భగవంతునికి నేనిలా వుండడమే యిష్టమేమో. కాని మీ భార్యతోను మీ మనసుతోను బాగా ఆలోచించుకోండి. ఇక నా వివాహప్రయత్నం చెయ్యకండి. ఆడదానికి ఒక్కడే భర్త. నేను యిలా బ్రహ్మచారిణిగానే వుండతలిచాను. గరల్ స్కూలులో హౌస్ టీచరు కావాలని తెలిసింది. రేపు వెళ్ళి కనుక్కుంటాను. కొద్ది రోజుల్లో అందులో చేరి బాలికల సేవలో నా జీవితం ముగించడం శ్రేయస్కరం అని చూస్తున్నాను" అని యింకా యేమేమో అంది కమల. మూర్తిగారు వింటూ నేవున్నారు కాని మనస్సు యిక్కడ లేదు. ఆయనకే తెలియని ఆలోచనలో పడింది. చివరకి ఎల్లాగో నిద్రలేకుండానే తెల్లార్చారు. "మళ్ళీ సాయింకాలం వస్తా కమలా" అని శలవు తీసుకుని మూర్తిగారు యింటికెళ్ళేటప్పటికి 8 గంటలు దాటింది ఉదయం. సుశీలాంబ యింకా కాఫీ తీసుకోలేదు. రాత్రి పొద్దుపోయేదాకా రానంటే యేమిటింకో వుండనుకుంది పాపం. తెల్లారి యింతసేపటిదాకా భర్త రాకపోవడంవల్ల మతిలేదు. యివాళ యేమయినా సరే అడగాలని అనుకుంది. యిద్దరూ కాఫీ, ఫలహారాలకి కూర్చున్నారు. మూర్తిగారు సుశీలమ్మని చూశారు. చిన్నపోయి వుంది. "ఏం, సుశీలా, ఇంకా నువ్వు కాఫీ తీసుకోలేదు. అల్లా వున్నావేం? ఎల్లాగైనా నువ్వు అదోకలా వుంటున్నావు. ఎందుకో చెప్పు." అనేటప్పటికి అప్పటిదాకా కష్టపడి ఆపుచేస్తూన్న దుఃఖం పొంగివచ్చి కళ్ళవెంట జలజలా నీళ్ళు రాల్చడం మొదలెట్టింది. మూర్తిగారు సుశీలాంబ దగ్గిర కూర్చుని కళ్ళు తుడుస్తూ "వూరుకో సుశీలా! ఏదో మనస్సులో పెట్టుకుని అనవసరంగా కలతపడతావు" అన్నారు. "అదోకలా వుంట నేనా మీరా?" అని మాత్రం అంది సుశీల. మూర్తిగారు సుశీల తల నిమురుతూ "రాత్రి రానందుకే నా నీకోపం. నువ్వు అల్లరి చేస్తావని నేననుకుంటూనే వున్నా" నన్నారు నవ్వుతో.

సమాప్తము.




# నమ్మకమైన చేతిగడియారములు

అన్ని గడియారములున్నూ పేరుపొందిన స్విస్ పనితనము, నిజమైన లివర్ కదలిక గలవి. [5 సం॥లు గ్యారంటీ]

15 రాళ్ళు క్రోమ్ కేసు రు. 55, 15 రాళ్ళు రోల్డుగోల్డు రు. 65, 7 రాళ్ళు క్రోమ్ కేసు రు. 35, 7 రాళ్ళు సెంటర్ సెకండ్లు రు. 40, 7 రాళ్ళు రోల్డుగోల్డు రు. 45, క్రోమ్ కేసు గడియారం రు. 16, క్రోమ్ కేసు సెంటర్ సెకండ్లు రు. 18, గోల్డన్ కేసు గడియారం రు. 20, అలారం టైంపీస్ రు. 18; మేలు రు. 21.

3 అణాల పోస్టుబిళ్ళలు పంపినచో బొమ్మలతో కూడ కేటలాగు పంపబడును.

ఉత్తరప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో జరుగవలయును.

**Superior Watch Co.,** No. 13 P. O. Suriya (E.I.R.) Bihar.